# చిత్తశుద్ధి

**చిత్తశుద్ధి అనగానేమి? చిత్తశుద్ధి కలుగ కుండా ఆత్మ విచారణ సాధ్యమా?**

**చిత్తస్య శుద్ధయే కర్మ న తు వస్తూపలబ్ధయే**
**వస్తుసిద్ధిర్విచారేణ న కించిత్కర్మకోటిభిః (వివేకచూడామణి–11)**

కర్మలు చిత్తశుద్ధి కొరకే కాని ఆత్మలభ్యం కొరకు కాదు. ఆత్మ అనునది విచారణతోనే సిద్ధిస్తుంది కాని కోటి కర్మలవలన కాదు అని శ్రీ శంకరభగవత్పాదులవారి అభిప్రాయం. ఇచ్చట చిత్తశుద్ధి, ఆత్మ విచారణ వేరువేరని చెప్పుచున్నారు. ఆత్మ విచారణ తప్ప కోటికర్మలు చేసిననూ జ్ఞానోదయం కలగదని వారి అభిప్రాయం.

**ప్రవృత్తి లక్షణం కర్మ జ్ఞానం సన్న్యాస లక్షణమ్**
**తస్మాత్ జ్ఞానం పురస్కృత్య సన్న్యసేదిహ బుద్ధిమాన్ (నారద పరివ్రాజకోపనిషత్ 3–3)**

బుద్ధిమంతుడు జ్ఞానము కోసమై కర్మసన్న్యాసము చేయవలెనని శ్రుతి బోధించుచున్నది (కర్మ, ప్రవృత్తిని కలగజేయును కనుక). అయితే కర్మలు చిత్తశుద్ధి కొరకే అని చెప్పుటలో దైవసంబంధమగు నవవిధ భక్తిమార్గములు, సేవలు మొదలుగునవి చేయుట వలన మానవునకు తత్త్వజిజ్ఞాస పెరుగుననియూ, కానీ అంత మాత్రమున 'ఆత్మవిచారణ' సాధ్యపడదనియూ వారి ఉద్దేశ్యం. ఇచ్చట చిత్తశుద్ధి సామాన్య అర్థంతో చెప్పబడింది. కాని, చిత్తశుద్ధి అను పదమునకు వేరే లక్ష్యార్ధమున్నది.

**'శుద్ధాంతఃకరణం జ్ఞేయం వేదోక్తం ప్రకృతిం ఖలు' (శృతి)**

అంతఃకరణ శుద్ధియే జ్ఞేయము అనగా లక్ష్యము. వేదములలో చెప్పబడిన కర్మలు ప్రాకృతమే కదా. అనగా ప్రకృతి సంబంధమై ప్రవృత్తిలో చేర్చును. అంతఃకరణ శుద్ధియే జ్ఞేయమైనపుడు అందులకై ఏదో ఒక ప్రయత్నమవసరమని అర్థమగుచున్నది.

**కర్మాత్మ విజ్ఞానమపి క్రమేణ సంపాద్యమేకేన నరేణ వేద యః కర్మణా**
**చిత్త విశుద్ధి మాప్య సవిద్యయాప్నోతి అమృతంహి విద్వాన్ (శృతి)**

ఒకే నరునిచే కర్మ, ఆత్మవిజ్ఞానము రెండునూ తెలియబడవలెననియూ, ఏ కర్మచే అమృతత్వమునొందెదరో ఆ జ్ఞానమును తెలుసుకొనవలెనని చెప్పుటచే చిత్తశుద్ధి కొరకు ఒక ప్రత్యేక విశిష్టమైన కర్మ కలదనియూ అర్థమగుచున్నది.

**యచ్చ కర్మ న బంధాయ తా విద్యాయా చ ముక్తయే**
**ఆయాసాయ పరం కర్మ విద్యాన్యా శిల్పనైపుణం** **(విష్ణుపురాణం)**

ఏ కర్మ అయితే బంధాన్ని కలుగజేయదో, ఏ జ్ఞానము చేత ముక్తి కలుగుచున్నదో, అదితప్ప ఇతర కర్మల వలన వ్యయప్రయాసమగు శిల్ప నిపుణత్వమే తప్ప, జీవత్వముండదు.

**'తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వా మోక్షసే అశుభాత్'** **(భ.గీ. 4-16)**

'ఓ అర్జునా! అశుభమైన సంసారము నుండి విముక్తి నొందుటకు ప్రత్యేకముగా నీకొక కర్మను చెప్పుచున్నా' నని శ్రీకృష్ణపరమాత్మ చెప్పుటచే, అన్ని కర్మలు చిత్తశుద్ధిని కలుగజేయలేవని రూఢియగుచున్నది. ఆ ప్రత్యేక కర్మ ఏమనగా...

**యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః** **(భ.గీ. 5-7)**

యోగయుక్తుడగువాడే శుద్ధాంతఃకరణ కలిగి, మనోజయమును, ఇంద్రియ జయమును పొందుచున్నాడని భావం. కావున చిత్తశుద్ధి కలుగజేయునది యోగకర్మ ఒక్కటియే.

**శుద్ధే చేతసి తస్యైవ స్వాత్మజ్ఞానం ప్రకాశతే**
**తస్మాత్ జ్ఞానం భవేద్యోగాత్ జన్మనైకేన పద్మజ** **(యోగశిఖోపనిషత్ 1-11)**

ఓ బ్రహ్మ ! చిత్తశుద్ధి గలవానికే ఆత్మజ్ఞానం ప్రకాశించును. అందువలన ఒకే జన్మలో మొదట యోగమునభ్యసింపుమని ఈశ్వరుడు బ్రహ్మతో చెప్పుచున్నాడు.

**ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే**
**ప్రసన్నచేతసోహ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే** **(భ.గీ. 2-65)**

ప్రసన్న మనస్కులకు సర్వదుఃఖముల నుండి హాని నశించి, మనసు బుద్ధియందు చేరియుండును. అనగా చిత్తశుద్ధి కలవారికి ఏ ఉపద్రవములు లేకుండా జ్ఞానముదయించునని భావం.

**చిత్తస్య హి ప్రసాదేన హన్తి కర్మ శుభాऽశుభమ్**
**ప్రసన్నాత్మాత్మని స్థిత్వా సుఖ మవ్యయ మశ్నుతే** **(మైత్రేయోపనిషత్ 1-10)**

యోగము ద్వారా చిత్తశుద్ధి నొందినవారికి శుభాశుభ కర్మలు రెండును హరించిపోవును. ప్రసన్న మనసు ఆత్మయందు చేరి అక్షయ సుఖమును పొందునని

భావము. చిత్తశుద్ధి యనగా అంతఃకరణ చతుష్టయమును యోగాగ్ని యందు దగ్ధము చేయుట. సామాన్య చిత్తము బొగ్గు (Carbon) వంటిది. శుద్ధినొందిన చిత్తం వజ్రం (Purified Carbon) వంటిది. వజ్రం ప్రకాశించునట్లు, అంతఃకరణ శుద్ధినొందిన వారికి ఆత్మజ్ఞానం ప్రకాశించును.

**ఆత్మ విచారణ ఎవరు చేయగలరు?**

విచారణ స్థూలము, సూక్ష్మము అని రెండు విధములు. స్థూల విచారణను (Gross Discrimination) సామాన్యంగా అందరు చేయగలరు. సూక్ష్మవిచారణ (Subtle Discrimination) ను యోగులు మాత్రమే చేయగలరు. ఆత్మ విచారణ యోగులకు మాత్రమే సాధ్యం. అందుచే...

**బహు వ్యాకుల చిత్తానాం విచారాత్తత్వ ధీర్నహి**
**యోగో ముఖ్యతరస్తేషాం ధీ దర్పస్తేన నశ్యతి** **(వేదాంత పంచదశి)**


సంసారములో నుండి బహువ్యాకుల చిత్తముతో నుండు వారలకు బ్రహ్మవిచారణ దుస్సాధ్యం. అట్టివారలకు యోగమే ముఖ్యమనియు, యోగముచే బుద్ధికి గల దర్పము నశించుననియూ విద్యారణ్యస్వాములవారు సిద్ధాంతీకరించారు. యోగముతో బుద్ధికి సూక్ష్మగ్రాహ్యశక్తి కలిగి ఆత్మవిచారణ చేయగలరు. పిమ్మట జ్ఞానోదయం కలుగును. **(విచారణాత్ జాయతే జ్ఞానం)** కాని ఇప్పటివారు శంకరాచార్యులవారి భావమును వక్రీకరించి, చిత్తశుద్ధికి యోగముతో సహా ఏ కర్మలు చేయనవసరము లేదని, కేవలం విచారణ చాలునని, స్థూలవిచారణ చేయుచూ, అనుభవము లేక భావాద్వైతు లగుచున్నారు.

**స రేచపూరై రనిలస్య కుంభైః సర్వాసునాడీషు విశోధితాసు**
**అనాహతాదంబురుహాదుదేతి స్వాత్మావబోధ స్వయమేవ గమ్య** **(యోగతారావళి)**

జగద్గురు శంకరాచార్యులవారే యోగతారావళి యందు రేచక పూరక కుంభకములతో ప్రాణాయామము చేసినచో సర్వనాడులు శుద్ధమై, హృదయమందు అనాహత పద్మము వికసింపబడి, ఆత్మజ్ఞానము స్వయముగనే కలుగునని చెప్పుటచే ఆది శంకరులు స్వయంగా యోగవిద్యను అభ్యసించిరనియూ, యోగముద్వారా ఆత్మ జ్ఞానము కలుగుననియూ విశదమగుచున్నది. అటులనే...

**యోగస్య ప్రథమం ద్వారం వాఙ్నిరోధోఽ పరిగ్రహః**
**నిరాశాచ నిరీహాచ నిత్యమేకాంత శీలతా** **(వివేకచూడామణి-368)**

యోగమునకు ప్రథమ ద్వారం మౌనమేననియూ, ఆహార నియమములను పాటించుచూ, అశాస్త్రీయ ధనమును స్వీకరించకుండా, ఏకాంతముగా, సర్వ కోరికల యందు నిస్పృహతో నుండమని చెప్పుటచే, **'వస్తుసిద్ధిర్విచారేణ'** అని వివేక చూడామణిలో చెప్పుటలో యోగమును అంతర్లీనముగా చెప్పుచూ, ఆత్మ విచారణ చేయమని అర్థం కలదు.



**'భగవాన్' వేద వ్యాస మహర్షి**